క్లుప్తంగా

జేఈఈ మెయిన్‌లో సత్తా చాటిన మోడల్ విద్యార్థిని



రుద్రూర్: మండలంలోని మోడల్ కళాశాల విద్యార్థిని ఆర్. భవాని కృప జేఈఈ మెయిన్‌లో సత్తా చాటింది. 76.16 పర్సంటైల్ సాధించి జేఈఈ అడ్వాన్స్ పరీక్షలకు అర్హత సాధించినట్లు ప్రిన్సిపల్ సతీష్ తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపకులు, విద్యార్థినిని, తల్లిదండ్రులను, అభినందించారు. భవాని కృప మోడల్ కళాశాలలో ప్రస్తుతం ఎంపీసీ సెకండియర్ చదువుతోంది.

క్షత్రియ జూనియర్ కళాశాల విద్యార్థుల ప్రతిభ

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం చేపూర్ క్షత్రియ జూనియర్ కళాశాల విద్యార్థులు జేఈఈ మెయిన్‌లో ప్రతిభ చూపారు. కళ్లెం వివేక్ రెడ్డి 97.75 పర్సంటైల్, షెట్పల్లి రిషిత్ 98.79 సాధించాడు. ఈసందర్భంగా విద్యార్థులను విద్యా సంస్థల చైర్మన్ అల్జాపూర్ శ్రీనివాస్ అభినందించారు.

జాగ్రత్తలు పాటిస్తే .. మీ చేతుల్లోనే ఆరోగ్యం



రెంజల్(బోధన్): జాగ్రత్తలు పాటిస్తే ఆరోగ్యం మీ చేతుల్లోనే ఉంటుందని వర్డ్ ఆర్గనైజేషన్ కమ్యూనిటీ కో–ఆర్డినేటర్ రజిత సూచించారు. మండలంలోని కళ్యాపూర్ గ్రామంలో గల ప్రాథమిక పాఠశాలతో పాటు పలు కూడళ్ల వద్ద బుధవారం అవగాహన సమావేశం నిర్వహించారు. హెచ్ఐవీ, ఎయిడ్స్, గృహహింస, కౌమార దశలో వచ్చే మార్పులపై విద్యార్థులతో పాటు స్థానికులకు అవగాహన కల్పించారు.

పూర్వ విద్యార్థుల ఆర్థిక సాయం



మాక్లూర్: చదువు బోధించిన గురువుకు పూర్వ విద్యార్థులు బుధవారం ఆర్థిక సహాయం అందించారు. మాక్లూర్ మండలం మెట్‌పల్లి గ్రామానికి చెందిన బి.నర్సయ్య అనే ప్రైవేట్ ఉపాధ్యాయుడు నవీపేట మండలం జన్నేపల్లిలో గల శ్రీహర్ష విద్యానికేతన్‌లో ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్నాడు. అతని కుమార్తె రుతిక వివాహం ఈనెల 16న ఉంది. దీంతో 2008–09 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఉపాధ్యాయుడిని కలిసి రూ.75,102 నగదును అందజేశారు.

నాణ్యమైన భోజనాన్ని అందించాలి



ఆర్మూర్ : గిరిజన సంక్షేమ కళాశాలలో విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించాలని మున్సిపల్ కమిషనర్ రాజు సూచించారు. పట్టణంలోని గిరిజన సంక్షేమ కళాశాలలో మధ్యాహ్న భోజనం వంట గది, స్టోర్ రూంలను బుధవారం పరిశీలించా రు. పరిసరాలు శుభ్రంగా ఉండేలా చూ సుకోవాలని, విద్యార్థులు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్త పడాలని సూచించారు. సిలబస్ పూర్తయిందా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజన నిర్వాహకులు, హెచ్ఎంకు పలు సూచనలిచ్చారు.

'ఎమ్మెల్యే పోచారంపై ఆరోపణలు సరికావు'



వర్ని: బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డిపై ఒక వర్గం కాంగ్రెస్ నేతల ఆరోపణలు సరికావని వర్ని మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షులు కలడం సాయరెడ్డి అన్నారు. పోచారం నిధులు రద్దు చేయించారని చేసిన ఆరోపణలు వాస్తవం లేదని వెల్లడించారు. వర్ని మండల కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే నియోజకవర్గ అభివృద్ధి కోసమే టీఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరారని పేర్కొన్నారు. వర్ని సొసైటీ మాజీ అధ్యక్షులు వీర్రాజు, మాజీ జెడ్పీటీసీ రంజానాయక్, నాయకులు గోపాల్, గిరి, తదితరులు పాల్గొన్నారు.

ఆటోనగర్‌లో వసతులు కరువు

- నివాసాల మధ్య నిలుస్తోన్న మురుగు
- కానరాని సీసీ రోడ్ల నిర్మాణం
- కి.మీ. దూరంలో రేషన్‌షాపు
- సమస్యలతో ఇబ్బందులు పడుతోన్న కాలనీవాసులు



కాలనీలో మట్టి రోడ్డు, పక్కన పిచ్చి మొక్కలు



కాలనీలో నివాసాల మధ్య నిలిచిన మురుగునీరు

బోధన్: పట్టణంలో ఒకటో వార్డు పరిధిలో ఆటోనగర్ కాలనీ ఏర్పడి ఏళ్లు గడుస్తున్నా ప్రభుత్వం కనీస వసతులు కల్పించడంలేదు. దీంతో కాలనీవాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాలనీలో ఇళ్ల మధ్య మురుగునీరు నిలుస్తోంది. సీసీ రోడ్ల నిర్మాణం కానరావడం లేదు. పట్టణ శివారులో బోధన్ నుంచి నిజామాబాద్ నగర కేంద్రానికి వెళ్లే ప్రధాన రోడ్డుకు అనుకుని ఆటోనగర్ కాలనీ ఉంది. నూతనంగా నిర్మించే ఇళ్లతో బల్దియాకు ఆదాయం సమకూరుతున్నా వసతుల కల్పనపై అధికారులు దృష్టి సారించడంలేదని కాలనీవాసులు ఆరోపణలు చేస్తున్నారు. కాలనీలో ప్రస్తుతం 250 నుంచి 300 వరకు పక్కా ఇళ్లు ,రేకుల షెడ్లు నిర్మించుకుని ప్రజలు నివాసం ఉంటున్నారు. జనాభా సుమారుగా 550 ఉంది. కి.మీ. దూరంలో ఉన్న ఆచన్‌పల్లికి వెళ్లి రేషన్ సరుకులు తెచ్చుకుంటున్నారు. కాలనీలో రెండు చోట్ల మాత్రమే సీసీ రోడ్లు వేశారు. మిలిగిన కాలనీ అంతా మట్టి రోడ్లు ఉన్నాయి. వర్షాకాలంలో మట్టి రోడ్లు బురదమయంగా మారుతున్నాయి. సీసీ డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో నివాసాల మధ్య మురుగు నీరు నిలుస్తోంది. పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారింది. దీంతో కాలనీవాసులు మురుగు దుర్వాసన, దోమల బెడదతో ఇబ్బందులు పడుతున్నారు. మట్టి రోడ్డు కిరువైపుల పిచ్చి మొక్కలు, ముళ్ల పొదలు ఏపుగా పెరిగాయి. విషపురుగులు సంచరిస్తున్నాయి. కాలనీలో 2009 లో మూడు బ్లాకులతో రాజీవ గృహ కల్ప సముదాయం నిర్మించి పేదలకు పంపిణీ చేశారు. ఈనివాసాలు శిథిలావస్థకు చేరాయి. ఆచన్‌పల్లి గ్రామపంచాయతీ నుంచి కాలనీ మున్సిపల్‌లో విలీనమైంది. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సీసీ రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణం చేపట్టాలని కాలనీవాసులు కోరుతున్నారు.

సీసీరోడ్లు, డ్రెయినేజీలు నిర్మించాలి



ఇళ్లు కట్టుకుని పిల్లలతో కలిసి ఇక్కడ ఏళ్ల నుంచి జీవనం సాగిస్తున్నాం. సీసీ రోడ్లు, డ్రెయినేజీలు లేక పిచ్చి మొక్కలు, ముళ్ల పొదలు ఏపుగా పెరిగాయి. విషపురుగులు సంచరిస్తున్నాయి. రాత్రి వేళ బయటకు వెళ్లాలంటే భయం వేస్తోంది. అధికారుల దృష్టికి తీసుకెళ్లిన పట్టించుకోవడం లేదు. – యశోద, కాలనీ మహిళ

దోమల బెడదతో ఇబ్బందులు



ఇల్లు కట్టుకుని ఇరవై ఏళ్ల నుంచి ఇక్కడే పిల్లలతో ఉంటున్నాం. కాలనీలో మట్టి రోడ్లు ఉన్నాయి. మురుగు కాలువలు నిర్మించ లేదు. ఇంటి చుట్టూ మురుగు నీరు నిలిచి దుర్వాసన వస్తోంది. దీంతో దోమల బెడద పెరిగిపోయింది. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి అభివృద్ధిపై దృష్టి సారించాలి. – లక్ష్మి, కాలనీ మహిళ

అభివృద్ధిపై దృష్టి సారిస్తాం

మున్సిపల్ విలీన గ్రామ పంచాయతీలు, కాలనీల అభివృద్ధికి బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని ప్రభుత్వ మార్గదర్శకాలున్నాయి. ఆచన్‌పల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని ఆటోనగర్ కాలనీకి సంబంధించి అభివృద్ధి అంశంపై దృష్టి సారిస్తాం.

– వెంకట నారాయణ, మున్సిపల్ కమిషనర్

విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

- ప్రభుత్వ ఉపాధ్యాయుల హక్కులు కాపాడుతా
- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బీజేపీ అభ్యర్థి మల్క కొమురయ్య



బోధన్‌లో మాట్లాడుతున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బీజేపీ అభ్యర్థి మల్క కొమురయ్య

బోధన్‌టౌన్(బోధన్): విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బీజేపీ అభ్యర్థి మల్క కొమురయ్య అన్నారు. బోధన్‌లోని బీజేపీ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన నియోజక వర్గస్థాయి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వ ఉపాధ్యాయుల హక్కుల కాపాడతానని పేర్కొన్నారు. ఉపాధ్యాయులకు వేతనాలు, పీఆర్సీ, డీఏలు రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వడకుండా రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని ఆరోపించారు. గడిచిన 10 ఏళ్లలో 9 లక్షల కోట్ల నిధులను రాష్ట్రంలో కేంద్ర ప్రభుత్వం వెచ్చించిందన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు దినేష్ కులాచారి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేడపాటి ప్రకాష్ రెడ్డి, వడ్డి మోహన్ రెడ్డి, జిల్లా కార్యదర్శి సుధాకర్ చారి, వివిధ మండలాల అధ్యక్షులు నాయకులు పాల్గొన్నారు.

వ్యాధి నిరోధక టీకాలు



పెర్కిట్(ఆర్మూర్): మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి ఆరోగ్య ఉప కేంద్రంలో వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని హెల్త్ సూపర్ వైజర్ అనసూయ కుమారి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్క చిన్నారికి వ్యాధి నిరోధక టీకాలు ఇవ్వాలని సిబ్బందికి సూచించారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. ఈకార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు జక్కుల మోహన్, శ్యామల, ఆశా కార్యకర్తలు శిరీష, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

అధ్యాత్మికం

■ వైభవంగా శ్రీ లక్ష్మి తిరుపతమ్మ కల్యాణం



బోధన్: సాలూర మండలంలోని సాలూర క్యాంప్, కొప్పర్తి క్యాంప్ గ్రామాల్లో గోపయ్య స్వామి సమేత లక్ష్మి తిరుపతమ్మ తల్లి కల్యాణం బుధవారం వైభవంగా వేదపండితులు నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నదానం చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మేడపాటి ప్రకాష్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఎడపల్లి మండల అధ్యక్షుడు పులి శ్రీనివాస్, పీఆర్‌టీయూ జిల్లా మాజీ అధ్యక్షుడు ఇల్తెపు శంకర్ దంపతులు, కొప్పర్తి క్యాంప్ లక్ష్మి తిరుపతమ్మ ఆలయ కమిటీ చైర్మన్ రావెళ్ల శ్రీనివాస్ రావు, బుజ్జి,వేణుగోపాల్, కోటేశ్వర్‌రావు, శ్యాంబాబు, సాలూర క్యాంప్ తాజా మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రావు, చంద్రశేఖర్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

■ ఘనంగా పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ..



కమ్మర్‌పల్లి : మండల కేంద్రంలోని శ్రీగిరి క్షేత్రం(బ్రహ్మంగారి గుట్ట)పై మాఘ పౌర్ణమిని పురస్కరించుకొని బుధవారం గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి, గోవిందమ్మల కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉత్సవ మూర్తులకు వీడీసీ తరపున పట్టు వస్త్రాలు, పుస్తె, మట్టెలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. భక్తులకు మహా అన్నదాన ప్రసాదం పంపిణీ చేశారు. సాయంత్రం రథోత్సవం నిర్వహించారు. గ్రామం నుంచి ఊరేగింపుగా గుట్టపైకి తీసుకెళ్లారు. కార్యక్రమంలో వీడీసీ అధ్యక్షుడు రామస్వామి, ఉపాధ్యక్షుడు గణేష్, కార్యదర్శి బాలు, కోశాధికారి బుచ్చిమల్లయ్య, సభ్యులు కిషన్, సామ బాలకిషన్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

■ వెంచిర్యాల్‌లో బంగారు వెంకన్న ..



బాల్కొండ: ముప్కాల్ మండలం వెంచిర్యాల్‌లోని బంగారు వెంకన్న బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా బుధవారం వేంకటేశ్వర స్వామి కల్యాణం ఘనంగా నిర్వహించారు. గురువారం అన్నదానం కార్యక్రమం ఉంటుందని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

■ ముప్కాల్‌లో శివ శ్రీనివాసుని ..

బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రంలోని ద్రోణ గుట్టపై గల ఆలయంలో శివ శ్రీనివాసుని కల్యాణం బుధవారం వైభవంగా నిర్వహించారు. భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

■ ఘనంగా ముజిగే మల్లన్న జాతర



పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లిలో బుధవారం వీడీసీ ఆధ్వర్యంలో ముజిగే మల్లన్న జాతర ఘనంగా నిర్వహించారు. మామిడిపల్లితో పాటు పరిసర గ్రామాల భక్తులు ముజిగే మల్లన్న స్వామిని దర్శించుకుని నైవేద్యాలు సమర్పించారు. అనంతరం గుట్ట చుట్టూ రథం తిప్పారు. ఈ కార్యక్రమంలో వీడీసీ సభ్యులు లక్ష్మణ్, రవి, శ్రీనివాస్, రాజన్న, సాజిద్, కుల సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

■ నాగాపూర్‌లో మల్లన్నకు ప్రత్యేక పూజలు

బాల్కొండ: మండల కేంద్రంతో పాటు మండలంలోని నాగాపూర్, బస్సాపూర్, బోదేపల్లి, ఇత్వార్‌పేట్, నాగాపూర్, ముప్కాల్ మండల కేంద్రంలో, మెండోరా మండలం సోన్‌పేట్ గ్రామాల్లో బుధవారం మల్లన్నకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు చేసి మల్లన్నకు నైవేద్యాలు సమర్పించారు. అనంతరం ఆలయ గుట్టల చుట్టూ రథంను తిప్పారు.

■ 14 నుంచి అపురూప వేంకటేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు

మాక్లూర్ : మండలంలోని అడవి మామిడిపల్లి శివారులో గల శ్రీ అపురూప వేంకటేశ్వర స్వామి ఆలయ 13వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 14 నుంచి 17వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ ట్రస్టు చైర్‌పర్సన్ అమృతలత బుధవారం తెలిపారు. 14న ఉత్సవాలు ప్రారంభించి, 15వ తేదీన ధ్వజారోహణం, గరుడ ప్రసాద వితరణ, 16న శ్రీవారి కల్యాణోత్సవం, 17న చక్రస్నానంతో ఉత్సవాలు ముగుస్తాయని పేర్కొన్నారు.

సంక్షిప్తం

మున్సిపల్ వాహనాల్లోనే చెత్తను వేయాలి

ఆర్మూర్: తడి చెత్త, పొడి చెత్తను వేరు చేసి మున్సిపాలిటీ ఆటోల్లో వేయాలని మున్సిపల్ సానిటరీ ఇన్‌స్పెక్టర్ గజానంద్ సూచించారు. ఈమేరకు మహిళలకు అవగాహన సదస్సును బుధవారం నిర్వహించారు. మున్సిపల్ పర్యావరణ ఇంజినీర్ పూర్ణమౌళి, వార్డ్ ఆఫీసర్ చక్రధర్, మున్సిపల్, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

రక్తదాతకు సన్మానం

కమ్మర్‌పల్లి: మండల కేంద్రానికి చెందిన నల్ల గణేష్ గుప్తా అనే రక్తదాతను స్థానిక గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో బుధవారం సన్మానించారు. 39 సార్లు రక్తదానం చేసినందుకు గాను వీడీసీ సభ్యులు పూలమాలలు, శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రముఖ కవయిత్రి మగ్గిడి లక్ష్మి, వీడీసీ అధ్యక్షుడు రామస్వామి, సభ్యులు బుచ్చిమల్లయ్య, రంజిత్, బాలకిషన్, పెంట కిషన్, సత్యపాల్ తదితరులు పాల్గొన్నారు.

వాల్ పోస్టర్ల ఆవిష్కరణ

ఆర్మూర్: సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర నాయకుడు కర్నాటి యాదగిరి సంస్మరణ సభను ఈ నెల 17న జిల్లా కేంద్రంలోని రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో నిర్వహించనున్నట్లు సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి దేవరాం, సబ్ డివిజన్ కార్యదర్శి కిషన్ తెలిపారు. పట్టణంలోని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ కార్యాలయం ప్రాంగణంలో వాల్‌పోస్టర్లను బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ సబ్ డివిజన్ నాయకులు మచ్చర్ల రాజన్న, పద్మ, అనిల్ కుమార్, మమత, నిఖిల్, సిద్దార్థ, నజీర్, తూర్పాటి శ్రీనివాస్, అరవింద్, బట్టు రవి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సంత్ రవిదాస్ జయంతి



బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రంలో మోచి సంఘం ఆధ్వర్యంలో బుధవారం సంత్ రవిదాస్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మోచి సంఘ సభ్యులు పోశెట్టి, కిరణ్, దిలీప్, రమేశ్, గంగారాం, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు వంట పాత్రల వితరణ

కమ్మర్‌పల్లి: మండలంలోని చౌట్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు బుధవారం స్థానిక పూర్వ విద్యార్థులు వంట పాత్రలను వితరణ చేశారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వండడానికి గాను 1998–99 ఎస్ఎస్‌సీ బ్యాచ్ పూర్వ విద్యార్థులు మహేష్‌గౌడ్, రామకృష్ణ, స్వామి, పూర్ణచందర్, నరేష్, సత్యనారాయణ రూ. 20 వేల విలువ చేసే వంట పాత్రలను కొనుగోలు చేసి ఎంఈవో, హెచ్ఎం ఆంధ్రయ్యకు అందజేశారు. కార్యక్రమంలో వీడీసీ చైర్మన్ కొమ్ముల రాజేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సేవాలాల్ జయంతిని సెలవు దినంగా ప్రకటించాలి

బోధన్‌టౌన్(బోధన్): సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ జయంతిని ప్రభుత్వం జాతీయ సెలవు దినంగా ప్రకటించాలని గిరిజన విద్యార్థి సంఘం మండల అధ్యక్షులు జాదవ్ ప్రవీణ్ నాయక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన చేశారు. 50 లక్షలకుపైగా జనాభా ఉన్న లంబాడాలకు మంత్రి వర్గంలో కాంగ్రెస్ ప్రభుత్వం చోటు ఇవ్వకపోవడం సిగ్గు చేటన్నారు.

బోధన్ లయన్స్ క్లబ్ కు 18 సేవ అవార్డులు



అవార్డులు అందుకున్న లయన్స్ క్లబ్ ఆఫ్ బోధన్ ప్రతినిధులు

బోధన్: లయన్స్ క్లబ్ ఆఫ్ బోధన్ శాఖకు అధికంగా 18 ఉత్తమ సేవ అవార్డులు వచ్చాయని క్లబ్ ప్రెసిడెంట్ కొడాలి కిషోర్ బుధవారం తెలిపారు. 2024–25లో 300 పైగా సామాజిక సేవ కార్యక్రమాలు నిర్వహించామని పేర్కొన్నారు. మంగళవారం రాత్రి పట్టణ కేంద్రంలోని లయన్స్ క్లబ్ భవన్‌లో లయన్స్ క్లబ్‌ల రీజియన్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఉత్తమ సేవలందించిన క్లబ్‌లను ఎంపిక చేసి అవార్డులను అందించారు. ఉత్తమ క్లబ్ అధ్యక్షుడిగా కొడాలి కిషోర్, కార్యదర్శిగా ఉమేష్ షిండే, కోశాధికారిగా సురేందర్ చౌదరి అవార్డులు అందుకున్నారు. సామాజిక స్ఫూర్తిని మునుముందు కొనసాగించాలని బోధన్‌కు చెందిన లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ మాజీ గవర్నర్ లక్ష్మి బసవేశ్వర్‌రావు అన్నారు. అవార్డులు అందుకున్న క్లబ్ ప్రతినిధులను లయన్స్ కంటి ఆస్పత్రి వ్యవస్థాపకుడు బసవేశ్వర్‌రావు , చైర్మన్ నర్సింహారెడ్డి అభినందించారు.



నగేష్ పంపటిని సన్మానిస్తున్న ఆర్మూర్ క్లబ్ ప్రతినిధులు

లయన్స్ క్లబ్ ఆఫ్ గ్రీన్ సేవలను విస్తృతం చేస్తాం

ఆర్మూర్: లయన్స్ క్లబ్ ఆఫ్ గ్రీన్ సేవలను మరింత విస్తృతం చేస్తామని క్లబ్ ఇంటర్నేషనల్ డిస్టిక్ గవర్నర్ నగేష్ పంపటి పేర్కొన్నారు. పట్టణానికి విచ్చేసిన ఆయనను ఆర్మూర్ క్లబ్ ప్రతినిధులు బుధవారం ఘనంగా ఆహ్వానించారు. అనంతరం ఆర్మూర్ క్లబ్ అధ్యక్షుడు పాల్కం వేణు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తమ క్లబ్ సేవలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సేవ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ఈకార్యక్రమంలో నిర్మల్, ముప్కాల్, బాల్కొండ, మోర్తాడ్ ప్రతినిధులు అసపల్లి శ్రీధర్, నరసింహరాజు, డీకే రాజేష్, నర్సయ్య, చేపూర్ గణేష్, రాజేశ్వర్‌రెడ్డి, అశోక్ పాంపట్టి, అల్జాపూర్ రాజేష్, కోడె స్వామి, దోండి సాయి కృష్ణ, మధు, నాని, గోపి తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ పంటలను పరిశీలించిన విద్యార్థులు



పంటను పరిశీలిస్తున్న విద్యార్థులు, హెచ్ఎం రాజీ మంజూషా

ఎడపల్లి(బోధన్): సాలూర మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు సేంద్రియ పంటలను బుధవారం పరిశీలించారు. గ్రీన్ స్కూల్ ఫీల్డ్ విజిట్‌లో భాగంగా మండలంలోని జైతాపూర్ ఆదర్శ రైతు కరుటూరి పాపారావు వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించారు. విద్యార్థులకు పాపారావు సంప్రదాయ పంటల పద్ధతులు ప్రకృతి వ్యవసాయం గురించి వివరించారు. గోకృపామృతం, జీవామృతం, పంచగవ్య వ్యవసాయ పద్ధతులను విద్యార్థులకు తెలిపారు. నేల సారవంతంగా ఉన్నప్పుడే పంటలు బాగా పండుతాయన్నారు. సేంద్రియ వ్యవసాయం చేయడం ఎంతో అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రాజీ మంజూషా, ఉపాధ్యాయులు సంతోష్ కుమార్ యాదవ్, రాజ్ కుమార్, విఠల్ కాంబ్లే, విజయలక్ష్మి, లింబగిరి జ్యోష్ణ, లక్ష్మీ విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా 1104 యూనియన్ ఆవిర్భావ వేడుక



బాల్కొండలో యూనియన్ ఆవిర్భావ వేడుకలను నిర్వహిస్తున్న ట్రాన్స్‌కో సిబ్బంది

బాల్కొండ : మండల కేంద్రంలో ట్రాన్స్‌కో ఏఈ కార్యాలయం వద్ద బుధవారం 1104 యూనియన్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను అధికారులు ఘనంగా నిర్వహించారు. యూనియన్ ఏర్పడి 75 వసంతాలు పూర్తయిన సందర్భంగా యూనియన్ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకుడు సంగం నరేందర్, లైన్ ఇన్‌స్పెక్టర్‌లు, లైన్‌మెన్‌లు తదితరులు పాల్గొన్నారు.

డిచ్‌పల్లి బైఫరికేషన్ ప్రక్రియను పూర్తి చేస్తాం

ఆర్మూర్: నూతనంగా ఏర్పడిన డిచ్‌పల్లి డివిజన్ ఉద్యోగ, కార్మికుల బైఫరికేషన్ ప్రక్రియను త్వరలో పూర్తి చేస్తామని స్పెషల్ కమిటీ చైర్మన్, ఎస్ఏవో పి.శ్రీనివాస్ పేర్కొన్నారు. పట్టణంలోని ట్రాన్స్‌కో డివిజన్ కార్యాలయం ఎదుట తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ 1104 యూనియన్ ప్లాటినం జూబ్లీ వేడుకలను బుధవారం నిర్వహించారు. యూనియన్ డివిజన్ అధ్యక్షుడు సంజీవ్ ఆధ్వర్యంలో డిచ్‌పల్లి బైఫరికేషన్ విషయంలో కాలయాపన చేస్తున్నారని నిరసన తెలిపారు. ఈసందర్భంగా ఎస్ఏవో శ్రీనివాస్ మాట్లాడుతూ నెల రోజుల్లో సీనియారిటీ లిస్టులను సరిచేసి బైఫరికేషన్ ప్రక్రియ పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో డివిజన్ ప్రధాన కార్యదర్శి నరేందర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

జెండాను ఆవిష్కరించిన విద్యుత్ కార్మికులు

వేల్పూర్ : విద్యుత్ కార్మికుల 1104 యూనియన్ 75 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా వేల్పూర్ మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్ వద్ద కార్మికులు బుధవారం జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎస్ఎల్ఐ వేణుగోపాలస్వామి, రాజు, భూపతి, ఖలీద్,నాగరాజు, సందీప్, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

వెండితెర | తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్ (ఆర్మూర్)

స్క్రీన్-1	భవాని వార్డ్-1997(తెలుగు)-12.30 సంక్రాంతికి వస్తున్నాం (తెలుగు)- 3.10 9.00 ఒక పథకం ప్రకారం(తెలుగు)-6.10
స్క్రీన్-2	సంక్రాంతికి వస్తున్నాం - 10.00, 1.00, 4.00, 7.00, 10.00
స్క్రీన్-3	పట్టుదల (తెలుగు) -10.00, 1.10, 4.20, 7.30, 10.40
స్క్రీన్-4	తండేల్(తెలుగు) - 10.00, 1.05, 4.10, 7.15, 10.20

ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	తండేల్(తెలుగు)-11.00 1.45 4.40 7.35 10.30
స్క్రీన్-2	సంక్రాంతికి వస్తున్నాం - 1.30, 7.30
స్క్రీన్-3	పట్టుదల(తెలుగు)-11.00, 1.40, 4.30, 7.20, 10.10

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	సంక్రాంతికి వస్తున్నాం - 10.30, 1.30, 4.30, 7.30, 10.30
స్క్రీన్-2	పట్టుదల (తెలుగు) - 10.05 1.15 4.25 7.35 10.45
స్క్రీన్-3	స్కై ఫోర్స్ (హిందీ) - 10.15 డాకు మహారాజు - 1.00, 7.20 దేవా (హిందీ) - 4.05, 10.25
స్క్రీన్ -4	దేవా (హిందీ) - 10.00, 7.10 స్కై ఫోర్స్ (హిందీ) - 1.15, 10.25 మదగజరాజ (తెలుగు) - 4.00
లలితామహల్	తండేల్(తెలుగు)-11.00, 2.00, 6.00, 10.00
దేవి	పట్టుదల (తెలుగు) - 11.00, 2.00, 6.00, 10.00
నటరాజ్	బాదాస్ రవికుమార్(హిందీ)-11.00, 2.00, 6.00, 10.00
విజయ్	సంక్రాంతికి వస్తున్నాం - 10.30, 2.15, 6.10, 10.05

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	88,300	వెండి(కిలో)	99,500
22 క్యారెట్స్	81,492		

– నిజామాబాద్ బిజినెస్

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	180
		లైవ్	140
స్కిన్‌లెస్	220	మటన్	800